కవితా కౌముది

# మేము మేమే..మాకు మేమే..

విజయ్

**విధాత విసిరేసిన విస్తరాకులో**
వదిలేసిన మెతుకులం కాదు మేము!
పరుగులో నాగరికతతో పోటీ  పడుతూ
అభివృద్ధిలో సంస్కృతితో తలపడతాం
సయ్యో టయ్యో తేల్చుకుంటాం
"మేం మేమే..మాకు మేమే"

సంధ్యావందన సంస్కృతి మరచి
పాచి  ముఖానికి పన్నీరు పూసుకొనే స్థాయికి చేరుకున్నాం
"మేం మేమే...మాకు మేమే"

సంకల్పం చదివే సాంప్రదాయం నించి
సెల్ ఫోన్‌లో చూసుకుంటే గాని
తారీఖు తెలీని ప్రగతి పథంలో అడుగు పెట్టాం

చంద్రమండలాన్ని ఆక్రమించుకొబోతున్నాం
కొన్నల్లాగితే సుర్యుడికైన చుక్కలు చూపించగలం
"మేం మేమే...మాకు మేమే "

మేం దేనికి తక్కువ కాదు
అన్నిటితో ప్రపంచంతో పోటీ పడతాం
హితవాదం, మితవాదం, పిడివాదం
చివరికి ప్రాంతీయ వాదం దేన్నీ వదిలిపెట్టం

మాకు మేమే సాటి
మేమంతా సామాన్యులం కాదు!
మేధావులమనే ముసుగులో
స్వార్ధపు రాక్షసుడు వేసిన
అష్ట గ్రహ భందనలో చిక్కుకుని
మూర్ఖత్వం, మూఢత్వం, నైసర్గిక రేఖలుగా ఏర్పరచుకుని
అభివృద్ధి మేలి ముసుగులో,
అధోగతిలో, పాతాళంలో, చిక్కుకున్న, పాపాత్ములం
మేం మేమే...మాకు మేమే



# ఎడబాటు

జ్యోతిర్మయి

**ఈ దారిలోనే కదూ నా చిన్నారి**
బుల్లి బుల్లి అడుగులతో పరుగులు తీసింది!
అదిగో ఆ తోటలోనే మునుపెన్నడో
ఊయల ఊగిన సందడి!

బుజ్జి సైకిలును  చూసి
మోమున మెరిసిన సంతోషం!
చారడేసి కళ్ళతో బెంగగా
స్కూలుకు వెళ్ళిన వైనం!

శాంతాతో  ఫోటోలు, జింజెర్ బ్రెడ్ హౌసులు,
హాలోవీన్ డ్రస్సులు, ఈస్టర్ ఎగ్ హంట్లు,
కోరస్ పాటలు, టెన్నిస్ ఆటలు ....
ఓహ్ ఎన్నెన్నో!!
అవన్నీ నిన్న మొన్నలా లేదూ!

ప్రతి మలుపులో నీ వేలు పట్టుకుని నడిపించాను!
మలుపులన్నీ దాటి చూద్దును కదా...
ఆ  చివర... మలుపు తిరుగుతూ.....
ప్రగతి పథంలో నీవు!!

నీ జ్ఞాపకాల బాసటగా
ఈ చివర నేను!!



# ఆ క్షణం

ఎస్.ఆర్.బందా

**ఒక మెరుపు మెరిసి కళ్ళు జిగేల్మన్న క్షణం..**

అహం పొడుచుకొచ్చి అస్థిత్వాన్ని మసకబార్చిన వైనం

అతి పురాతనమైన బహిర్గత రహస్యంలో

అప్పటి తాదాత్మ్యాన్నే దాదాపు అందుకున్న క్షణం

అదే చోట ఆ మూలలోనే మరో వాహిని చుట్టుకుని

మార్గ రహిత ప్రయాణంలో మరో మరీచికని పలవరించిన చిత్రం!

మూతలు తెరుచుకోక, మాటల మూటలు బరువై

చరిత్ర తిరగరాయాలన్న విచిత్ర వేషం వేయబోయి

ఔరా..ఎంత సుఖం అమ్మో..మరెంత దుఃఖం

ప్రభూ..నాకెందుకీ శీతలోష్ణ స్వేదజ్ఞానం!

వున్న బాణాలెందుకిలా ఖర్చవాలి

తగ్గిన ప్రాణాలెన్నాళ్ళిలా కొడి గట్టాలి?

నిషిద్ధ రసాలకి దాసోహమన్న చేతులనే

విముక్త సుమాలుగా మార్చి

అవ్యక్త మనోహర దృశ్యాలని

అంతర్నేత్రాలతో ఆనందించాలి

వెలికురికే వేడి వైరాగ్యాన్ని

అంజలి ఘటించి ఆస్వాదించాలి..



# కృతఘ్నత

వింజమూరి రాగసుధ

**కరం అందించినా కరవాలం దూసావు**
నవనీతం తినిపించినా నవనాడులూ కృంగదీసావు
జీవాన్ని, జీవనాధారాన్ని నిలిపినా
వెలుగునీడల్లో వెన్నంటి ఉన్నా
వెన్నుపోటు పొడిచావు నిలువుదోపిడీ చేసావు
ఆప్యాయత కరువై పసివాడిలా పరితపిస్తుంటే
ఆత్మీయతని పంచి ఇచ్చి
లాలనల లేపనం పూసిన ధరణి లలామను
గొడ్డలందుకొన్నావు ఘోరంగా గాయపరిచావు
ఆ కత్తివేటు  ఈ కృతఘ్నతకాటు
భళిభళిరా మానవా
నీ దౌర్జన్యానికి ఇదే దీటు



# ఇంతేనా..జీవితం

బుద్ధ వెంకట ప్రతాప్ రెడ్డి

**సముద్రం వడ్డున రాసుకున్న రాతల్లా**
చూసి మురిసిపోయే లోపే ...
ఇంకో అల వచ్చి తన్నుకుపోయినట్టు ...
రోజులు గడిచి పోతున్నాయి ...!!
అలా మిగలదు ....నా శిలా మిగలదు ...!!
మధ్యలో కలలొకటి ...
వెన్నెల్లా పరుచుకొని కవ్విస్తాయి ...!!
ఆ వెన్నెలా వుండిపోదు ....
నా కన్నులూ నిండి పోవు ...
ఎప్పుడూ వెలితిగానే వుంటుంది .. !!
చిల్లు పడిన బిందెలా ...
ఈ జీవితం ఎంతకీ నిండదు ... !!
చేతిని అడ్డుపెట్టి ఆపాలని చూస్తాను...!!
అలసట ఎక్కువై ..
ప్రాణాలు అదుపు తప్పుతాయే గానీ...
ఎన్ని తీరాలకు చేరినా
ఈ ఆరాటం తీరదు..!!
జీవితమంతా ఇదే పోరాటం
అని తెలిసే రోజున...
నాకు శక్తి వుంటే బాగుండు...!!
కొంచెం దీని గమన్నాన్ని మార్చి చూస్తాను..!!



# జ్ఞాపకాలు

శ్రీమతి రత్నమాంబ చీర్ల

**గోదావరి సైకత శ్రేణులలో కట్టుకున్న పిచ్చుక గూళ్ళు**
అలల తాకిడికి కొట్టుకుపోతే నా కళ్ళనిండా కన్నీళ్ళు
నిల్చుని చూస్తున్న బిత్తర చూపులు
అమ్మ అక్కున చేర్చుకున్న అనుభూతి వాసనలు
నిన్ననే జరిగినట్టున్న నాటి జ్ఞాపకాలు !

బొమ్మల పెళ్ళిళ్ళతో, పెళ్ళి సందళ్ళతో ఆదివారాలు
గుజ్జనగూళ్ళలో వండి వడ్డించిన విందు భోజనాలు
ఉడికీ ఉడకని పప్పు, వేగీ వేగని కూరలు
చిమిడిపోయిన అన్నాలే అమ్మ వంటని మించిన అమృతాలు
రాత్రంతా అమ్మమ్మని విసిగించే కడుపునొప్పులు
శొంఠి ఉక్కిరి తింటే గానీ తీరని బాధలు
స్మృతి పథంలో మధురభావనలు!
నిన్ననే జరిగినట్టున్న నాటి జ్ఞాపకాలు !

చదువులూ, ఉద్యోగాలూ, పెళ్ళీ , పిల్లలూ
వారి ఆటలూ, కేరింతలూ, వేధింపులూ, ఊరడింపులూ
వీరీ వీరీ గుమ్మళ్ళు, గప్‌చుప్పయ్యిన దొంగలు
గోరింటాకులు పెట్టి ఊగించిన తద్ది ఊయలలు!
ఉద్యోగంలోని అలుపులు తీర్చిన పిల్లల చదువు సంధ్యలు
నిన్ననే జరిగినట్టున్న నాటి జ్ఞాపకాలు !

పదవీ విరమణ, వృద్ధాప్యం,
ఇంత చిన్నదా జీవితం!
తిరిగే చక్రం లాంటిదీ కాలం
చరిత్ర పునరావృతం!

పొట్టచేతపట్టుకు పల్లెలొదిలి పట్టణాలకొస్తే మా తరం,
పట్టా చేతికి రాగానే దేశం వదిలింది మా పిల్లల తరం!
పట్టి లాక్కొచ్చింది మమ్మల్ని పేగుబంధం
కట్టి పడేసింది ఓపికలేని ముసలితనం!

శాండ్ బాక్సుల్లో పిచిక గూళ్ళు కడుతున్న
మనవల ఆటల్లో
నాటి గోదారి ఊసుల్ని గుర్తు చేసుకుంటున్నా!
బార్బీల కిచెన్‌లో పార్టీలు చేస్తున్న
మనవరాళ్ళ వంటల్లో
నా గుజ్జనగూళ్ళ రుచులు చూస్తున్నా!

స్విమ్మింగ్ పూల్‌లో పిల్లల కేరింతల్లో
రమ్మని పిలుస్తున్నాయి మా ఊరి చెరువు చేపలు!
థామస్ ట్రెయిను ప్రయాణంలో
తలపుకొచ్చిన పల్లకీ ఊరేగింపులు!
కొబ్బరి బూరల్లా వినిపిస్తున్న రికార్డర్ శబ్దాలు!
లెగో విమానాల రెక్కల మీద
ఎగిరి వస్తున్న లెక్కలేనన్ని జ్ఞాపకాలు
ఎన్నెన్నో మధురమైన నా బాల్య స్మృతులు!
కాలమనే మట్టిలో కప్పేసిన గతం గురుతులు!
మనసు పొరల్లో కురిసిన తలపుల వానలు!
వానకు తడిసిన మట్టి వాసనలు!
ఆ వాసనతో మళ్ళీ ఊపిరి పోసుకున్న నా తలపులు
అందుకేనేమో...
కొత్తగా నిన్ననే పుట్టినట్టు.....
నిన్ననే జరిగినట్టున్న నాటి జ్ఞాపకాలు!

***

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

**చిరము మాటాడుచుందు నీ చెంత చేరి**
ఇపుడు రేపును మాపునింకెప్పటికిని
ఏదొ యొకటి నీ తోడ భాషించుచుందు
అర్థమున్నను లేకున్ననవరతము

**పలుకుచుందును నీ యూరి వారి గూర్చి**
హితులునన్నదమ్ములును స్నేహితుల గూర్చి
నీదు తల్లిదండ్రుల గూర్చి నిన్ను గూర్చి
అందరిని గూర్చి విడువక యడుగుచుందు

**పెదవి దాటు నీ పల్కుల విని తరింతు**
ప్రతి దినము ప్రతి నిమిషము ప్రతి క్షణమ్ము
మనసులోనుండి పొంగెడు మాట యైన
ముక్తసరివైన నాలుగు ముక్కలైన

**నీకు నచ్చినవెల్లను నాకు నచ్చు**
మునుపవెన్నడు వినకపోయినను గాని
నీ యభిమతమ్ముల యభిమానినగుచుందు
నిన్ను మెప్పించుటకు గాదు నిజముగాను

**ఏమి వింతయో మరి యిది యేమి మార్పొ**
నిలువకోరుదు నీదు సన్నిధిని సతము
శాశ్వతమ్మొ! మరి యిది యశాశ్వతమ్మొ!
చేరువయు దూరమును గాని చెలిమి యేమొ!

POST YOUR COMMENTS